క్లుప్తంగా

టీచర్ పోస్టు భర్తీ చేయాలి



డీటీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఖాళీ ఉన్న టీచర్ పోస్టును భర్తీ చేయాలని కోరుతూ పీడీఎస్ యూ ఆధ్వర్యంలో డీటీడీవో రమాదేవికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ పాఠశాలలో ఇటీవల సోషల్ టీచర్ బదిలీ అయ్యారని, ఇప్పటివరకు ఆ పోస్టు భర్తీ చేయడం లేదన్నారు. దీంతో విద్యార్థులు నష్ట పోతున్నారని తెలిపారు. వెంటనే సోషల్ టీచర్ పోస్టు భర్తీచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకులు కోటేశ్వర్, రమ్య కుమారి, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య కమిటీ

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ ఆర్యవైశ్య మండల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గణపురం సంతోష్, ప్రధాన కార్యదర్శిగా రావుల కృష్ణ, కోశాధికారిగా చిలువేరు భాస్కర్ ఎన్నికయ్యారు. మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సముద్రాల రాజన్న, రాచకొండ రాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భీం విగ్రహావిష్కరణకు తరలిరావాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి గ్రామంలో ఈనెల 24న నిర్వహించే కుమురం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆదివాసీలు తరలిరావాలని ఆదివాసీ గోండ్వానా కోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. ఆదివాసీలు హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. జిల్లా నాయకుడు తలండి మధుకర్, రాజ్‌గోండ్ సేవా మండల అధ్యక్షుడు తలండి మల్లేశ్, నాయకులు మడ్డ శ్రీనివాస్, భుజంగరావు, అర్జు, సత్యనారాయణ, రమేశ్, బొట్లకుంట్ల రాములు, నవీన్ పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళా ప్రదర్శన

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో గురువారం ప్రజాపాలన విజయోత్సవ కళాప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఆరు గ్యారంటీలు అమలవుతున్న తీరుపై పాటల రూపంలో వినిపించారు. పంచాయతీ కార్యదర్శి ఆసిఫ్ అలి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కెరమెరి: బ్యాంకు సేవలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సద్వినియోగం చేసుకోవాలని కెరమెరి టీజీబీ మేనేజర్ శ్రీపాద్ కోరారు. మండలంలోని సాంగ్వి, కెలిబి గ్రామాల్లో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలోపు రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ లభిస్తోందన్నారు. నాబార్డు ఆర్థిక సౌజన్యంతో సైబర్ నేరాలు, మొబైల్ బ్యాంకింగ్, ఓటీపీ నంబర్ తదితర అంశాలపై కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. సాంగ్వి, కెలిబి గ్రామ పటేళ్లు మొహర్లే హన్మంతు, చిన్ను, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సిర్పూర్(టి): మండలకేంద్రానికి చెందిన ఆడె విశ్వనాథ్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్సై కమలాకర్ గురువారం అందజేశారు. సెల్‌ఫోన్ పోయిందని బాధితుడు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశాడు. ఫోన్ లొకేషన్ ట్రేస్ చేసి గుర్తించి బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పుస్తకాలు చదివించాలి

కెరమెరి: రూం టు రీడ్ పుస్తకాలను ప్రతిరోజు విద్యార్థులతో చదివించాలని క్లస్టర్ అధికారి రాజు అన్నారు. మండలంలోని సుర్దాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులను బోర్డుపై ఉన్న పదాలను చదివించారు. హెచ్‌ఎం సురేశ్ తదితరులు ఉన్నారు.

అవగాహన ఏది?

- పీఎంకేఎంవైలో రైతులకు రూ.3 వేల పింఛన్
- ప్రీమియం చెల్లించని రైతులు
- నీరుగారుతున్న లక్ష్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

కౌటాల: రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే వృద్ధ రైతులకు చేదోడుగా ఉండేందుకు పింఛన్ అందించాలని కేంద్రం నాలుగేళ్ల క్రితం ప్రధానమంత్రి కిసాన్ మన్‌ధన్ యోజన పథకం(పీఎంకేఎంవై)ని ప్రారంభించింది. ఈ పథకంలో 60 ఏళ్లు దాటిన రైతులకు ప్రతినెలా రూ.3 వేల పింఛన్ అందుతోంది. వయస్సు ఆధారంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అయితే రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కాని ఈ పథకంపై వారికి అవగాహన లేకపోవడంతో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

అవగాహన కరువు

జిల్లాలో మొత్తం 1.20 లక్షల మంది వరకు రైతులు ఉన్నారు. గత నాలుగేళ్ల క్రితం పీఎంకేఎంవై పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించడంతో వ్యవసాయ అధికారులు 2021లో మాత్రం మొక్కుబడిగా రైతులకు ఈ పథకంపై అవగాహన కల్పించారు. గత మూడేళ్ల నుంచి ఈ పథకంపై రైతులకు ఎలాంటి అవగాహన కల్పించకపోవడంతో చాలామందికి తెలియదు. పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే ఈ పథకంలో చేరి వృద్ధాప్యంలో లబ్ధి పొందే అవకాశం ఉంది. ఈ పథకానికి ఎంతమంది రైతులు అర్హులు, ఎందరు దరఖాస్తు చేసుకున్నారో కూడా సంబంధిత వ్యవసాయశాఖ అధికారుల వద్ద రికార్డు లేకపోవడం గమనార్హం.

రూ.55తో ప్రారంభం

ప్రధానమంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన పథకంలో చేరిన రైతులు నెలకు రూ.55 నుంచి కడుతూ రావాలి. గరిష్టంగా రూ.200 వరకు కట్టాల్సి రావొచ్చు. మీరు ఏ వయసులో పథకంలో చేరారనే అంశం ప్రాతిపదికన మీరు చెల్లించాల్సిన మొత్తం ఆధారపడి ఉంటుంది. 18 ఏళ్లలోనే స్కీమ్‌లో చేరితే నెలకు రూ. 55 కడితే సరిపోతుంది. అదే 40 ఏళ్ల వయసులో చేరితే నెలకు రూ.200 చెల్లించాలి. 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతినెలా రూ.3 వేలు వస్తాయి. నేరుగా బ్యాంక్ అకౌంట్‌లోనే డబ్బులు జమవుతాయి. చిన్న, సన్నకారు రైతులకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకువచ్చారు. ఈ పథకంపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అర్హతలు, వివరాలిలా..

- ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు.
- 18 నుంచి 40 ఏళ్ల లోపు వారు మాత్రమే
- భార్యభర్తలు విడివిడిగా దరఖాస్తు చేసుకోవచ్చు
- వయస్సు ఆధారంగా ప్రతినెలా రూ. 55 నుంచి రూ. 200 వరకు ప్రీమియం చెల్లించాలి.
- రైతు చెల్లించే ప్రీమియంతో సమానంగా కేంద్రం వాటా కూడా చెల్లిస్తోంది
- దరఖాస్తు చేసుకున్న వారు 60 ఏళ్లకు ముందుగా మరణిస్తే చెల్లించిన మొత్తం వడ్డీతో సహా తిరిగి నామినీకి చెల్లిస్తారు.
- రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు

అనర్హులు ఎవరంటే..

- చిన్న, సన్నకారు రైతులు చట్టబద్ధమైన సామాజిక భద్రత పథకాల్లో ఉన్నవారు, రాష్ట్ర ఉద్యోగ బీమా పథకం, ఎంప్లాయిమెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ స్కీమ్‌లో ఉన్నవారు
- ప్రధానమంత్రి శ్రమయోగి మన్ ధన్ యోజనలో ఉన్న రైతులు
- సంస్థాగత భూములు కల్గిన వారు
- రైతు కుటుంబంలో ఎవరైన గతంలో లేదా ప్రస్తుతం రాజ్యాంగ పదవిలో ఉన్నవారు
- కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు
- రూ.10 వేలపై పింఛన్ పొందుతున్న వారు, ఆదాయ పన్ను చెల్లించేవారు అనర్హులు

పథకం తెలియదు



రైతులకు అవగాహన కల్పించకపోవడంతో చాలా మందికి పీఎం కిసాన్ మన్‌ధన్ యోజన పథకం గురించి తెలియదు. ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామంలో నిర్వహించాలి.

– విలాస్, రైతు, గుండాయిపేట.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని అర్హులైన రైతులు ప్రధానమంత్రి కిసాన్ మన్ ధన్ యోజన్ పథకం సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. పథకంలో చేరినవారికి వృద్ధాప్యంలో ప్రతినెల రూ.3 వేల పింఛన్ అందిస్తోంది. అన్ని గ్రామాల్లో ఈ పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

– పెందోర్ ప్రేమలత, ఏవో, కౌటాల

బెల్లంపల్లి ఏరియాలో జీఎం సెక్యూరిటీ పర్యటన



చెక్‌పోస్టు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణ

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో గురువారం జీఎం సెక్యూరిటీ లక్ష్మీనారాయణ పర్యటించారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఆయనకు ముందుగా జీఎం శ్రీనివాస్ అధికారులతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. మూతపడిన ఎంవీకే 3 ఇంక్‌లైన్‌తోపాటు డోర్లి–1, డోర్లి–2 ఓసీపీలతోపాటు వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్, ఖైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఏరియాలో సింగరేణి ఆస్తుల పరిరక్షణకు చేపట్టిన రక్షణ చర్యలను పరిశీలించారు. సింగరేణి ఆస్తులు, బొగ్గు అక్రమ రవాణా జరగకుండా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఏర్పాటు పనితీరును పర్యవేక్షించారు. ఏరియా స్టోర్ వద్ద ఏర్పాటు చేసిన డంప్‌యార్డును సందర్శించారు. ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, ఏరియా ఇంజినీర్ భీంరావు జాడే, డీజీఎం స్టోర్స్ శ్రీనివాస్‌రావు, డీజీఎం వర్క్‌షాప్ కృష్ణమూర్తి, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, సివిల్ ఎస్‌ఈ మదీనా భాషా, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు రాజమౌళి, చంద్రయ్య పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బంది కొరత తీర్చాలి

బెల్లంపల్లి ఏరియాలో సెక్యూరిటీ సిబ్బంది కొరత తీర్చాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి అన్నారు. గురువారం బెల్లంపల్లి ఏరియా పర్యటనకు వచ్చిన సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణను నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఎస్‌అండ్‌పీసీ డిపార్టుమెంట్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందచేశారు. ఫిట్ కార్యదర్శులు కందుల మల్లేశ్, మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేశ్, కిరణ్‌బాబు, రాజయ్య, సహాయ కార్యదర్శి జహంగీర్, నాయకులు రమేశ్, అంజయ్య, రాజు, గణేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఖైరిగూడ ఓసీపీ ఫిట్ కమిటీ

రెబ్బెన: ఖైరిగూడ ఓసీపీ టీబీజీకేఎస్ ఫిట్ కమిటీని ఎన్నుకున్నట్లు ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు తెలిపారు. ఓసీపీ ఫిట్ కార్యదర్శిగా బొంగు వెంకటేశ్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శిగా మారినేని చందర్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా సంపతి తిరుపతి, ఏ రిలే షిఫ్ట్ ఇన్‌చార్జిగా గొల్ల క్రిష్ణ, బీ రిలే షిఫ్ట్ ఇన్‌చార్జిగా శ్రీనివాస్, సీ రిలే షిఫ్ట్ ఇన్‌చార్జిగా సాలి గామ రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా దాగం సంజీవ్, సిరికొండ చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా గాదర్ల అనేష్, కైత స్వామి, మోరె సత్యనారాయణ, కోశాధికారిగా మురహరిరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మొగిలయ్య, శంకర్, భిక్షపతి,రాజమౌళి, అజీమ్, సుధాకర్, శ్రీనివాస్, రమేశ్, బాపు, రమేశ్, శివకుమార్, శేఖర్ ఎన్నికయ్యారు. అనంతరం ఓసీపీ మేనేజర్ శంకర్‌కు కమిటీ నియామకపత్రాన్ని శ్రీనివాస్‌రావు అందించారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తిర్యాణి: గుండాల గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రొంపెల్లి నుంచి గుండాల గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు హన్మండ్ల జగదీశ్, మాజీ ఎంపీటీసీ కోవ మోతీరాం, గ్రామస్తులు మర్సుకోల అశోక్, మారుతి, సీతారాం, లక్ష్మణ్, భీంరావు తదితరులు ఉన్నారు.

23, 24 తేదీల్లో ఓటరు నమోదుపై ప్రచారం

ఆసిఫాబాద్: జిల్లాలో ఈ నెల 23, 34 తేదీల్లో ఓటరు నమోదుపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో లోకేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం– 2025లో భాగంగా ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓటరు సౌకర్య కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. బూత్‌స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. 2025 జనవరి 01 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుతోపాటు సవరణ కోసం ఈ నెల 28 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

పత్తి పంటల పరిశీలన

రెబ్బెన: పత్తి రైతులు అధిక దిగుబడిని ఇచ్చే మేలు రకం పత్తి విత్తనాలను ఎంచుకోవాలని శ్రీరాం బయోసీడ్స్ పత్తి విత్తన కంపెనీ ప్రతినిధులు శ్రీనివాసరావు, సతీశ్ అన్నారు. నవేగాంలో గురువారం పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాహుల్‌సింగ్ పాస్‌వార్, గౌరవ్, మహేశ్, రాజు, వెంకటేశ్, భీమయ్య, సాయికిరణ్ ఉన్నారు.

108లో ప్రసవం

రెబ్బెన: 108 వాహనంలో గర్భిణి ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని నవేగాంకు చెందిన తానుబాయికి గురువారం పురిటినొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. అందుబాటులో ఉన్న కాగజ్‌నగర్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఆమెను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మోతుగూడ వద్ద సిబ్బంది ఆమెకు పురుడు పోయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను ఆసిఫాబాద్‌కు తరలించినట్లు ఈఎంటీ రిజ్వాన్‌ఖాన్ తెలిపారు. 108 సిబ్బందికి తానుబాయి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన నివాసంలో గురువారం పంపిణీ చేశారు. 10 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్, తెలిగాండ్ల సంఘం నాయకులు సందీప్, మురళి పాల్గొన్నారు.

నేడు సైబర్ నేరాలపై అవగాహన

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం మధ్యాహ్నం 12.00 గంటలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ వి.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

దహెగాం: నాటుసారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. మర్రిపల్లి నుంచి బైక్‌పై నాటుసారా తరలిస్తున్నారని అందిన సమాచారంతో గురువారం వాహనాలు తనిఖీ చేశామన్నారు. అదే గ్రామానికి చెందిన బాదావత్ తిరుపతి బైక్‌పై వస్తుండగా తనిఖీ చేయగా 10 లీటర్ల నాటుసారా లభ్యమైందన్నారు. నాటుసారాతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న బాలకృష్ణ

కెరమెరి: బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందన్నారు. రైతు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో నాయకులు వేణు, వెంకట్‌నాయక్, రాజు, శ్రీకాంత్, సెడ్మకి తుకారాం, ఉత్తం, నవీన్ కుమార్, వినోద్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్(సిర్పూర్): తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గురువారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అధికారులు, నాయకులతో కలిసి స్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందించారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



కౌటాల: ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

కౌటాల: విద్యాశాఖ–సమగ్ర శిక్షాలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కోరుతూ ఎంఈవో జి.హన్మంతుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం టైమ్ స్కేల్ కల్పించాలన్నారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ సమయంలో బెనిఫిట్స్ కింద రూ. 25 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం 15 రోజుల్లో తమ సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. నాయకులు పవిత్ర, శిరీష, రాజమణి, భువనేశ్వరి, విజయ, ధనలక్ష్మి, దేవన్న, ప్రకాశ్, లాలాజీ, సుమన్, లూలాజీ తదితరులు ఉన్నారు.

రెబ్బెన: సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షుడు వేముల సత్యనారాయణ కోరారు. ఎంఈవో వెంకటేశ్వర్లుకు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. సీఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, సీఆర్పీలు దేవేందర్, మహేశ్వర్, సీసీవో భాగ్యలక్ష్మి, పీటీఐలు శేఖర్, టి.స్వప్న, పుష్పలత, తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల హక్కుల కోసం పోరాడాలి



ఆసిఫాబాద్: జెండా ఆవిష్కరిస్తున్న మురళీధర్

ఆసిఫాబాద్: ముదిరాజ్‌ల హక్కుల కోసం పోరాడాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సేర్ల మురళీధర్ అన్నారు. ముదిరాజ్ దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గురువారం సంఘం జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు పెద్దమతల్లికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ(డీ)లో ఉన్న ముదిరాజులను బీసీ(ఏ)లో చేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణంతోపాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు పులి సతీశ్, నాయకులు రవి, రాజేశ్, నరేశ్, బాలేశ్, సాయిరాం, శంకర్, ఎస్ రవి, తిరుపతి పాల్గొన్నారు.

కౌటాల: బోదంపల్లిలో గురువారం ముదిరాజ్‌లు సంఘం జెండాను ఎగురవేశారు. మండల అధ్యక్షుడు కమలకర్, నాయకులు జగదీశ్, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంలో ముదిరాజ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సురేష్ సంఘం జెండాను ఆవిష్కరించారు. నాయకులు నెల్లి మహేశ్, పంబాల సన్యాసి, అశోక్, జక్కం లింగయ్య, అంజయ్య, శ్రీశైలం, పుల్లబోయిన శ్రీనివాస్, రావని, మూసా అరుణ్‌కుమార్, తునికి రాజేశ్, ధోని నరేశ్, ఆకుల సాయి, పులబోయిన శ్రీనివాస్, నెల్లి మహేశ్ పాల్గొన్నారు.

కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అంబాల ఓదెలు

రెబ్బెన: సింగరేణి కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (టీబీజీకేఎస్) బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. గురువారం ఖైరిగూడ ఓసీపీలో కన్వేయన్స్ డ్రైవర్లను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్లకు వెంటనే సీఎంపీఎఫ్ పర్మినెంట్ అకౌంట్ నంబర్లకు అందించాలన్నారు. అనంతరం ఓసీపీ వెల్ఫేర్ అధికారి వేణు దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. డ్రైవర్లు గణేశ్, మహేందర్, వెంకటేశ్, సంజీవ్, సదాశివ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరిగూడ ఓసీపీకి మూడో బస్సును కొనసాగించాలి

రెబ్బెన: ఖైరిగూడ ఓసీపీలో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం మూడో బస్సును కొనసాగించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. ఖైరిగూడ ఓసీపీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏరియా యాజమాన్యం టెండర్ పూర్తయిందని సాకుతో గత 45 రోజుల నుంచి ఖైరిగూడ ఓసీపీకి బస్సు సేవలు నిలిచిపోయాయన్నారు. దాంతో గోలేటితోపాటు వివిధ ప్రాంతాల నుంచి విధులకు హాజరయ్యేందుకు వచ్చే ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సెంట్రల్ కమిటీ నాయకులు చంద్రశేఖర్, సమ్మయ్య, కార్నాతం వెంకటేశం, ఒరం కిరణ్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

గుంతలు తవ్వారు..వదిలేశారు



లింగాపూర్: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వెనుక భాగాన లింగాపూర్ ఆసుపత్రి సబ్ సెంటర్ కోసం కాంట్రాక్టర్ గుంతలు తవ్వించి వదిలేశారు. సబ్‌సెంటర్ నిర్మాణ కోసం రూ.12 లక్షల నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ గుంతల పక్కన్న ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు ఆటలు ఆడుతుంటారు. పశువులు సైతం సంచరిస్తున్నాయి. అక్కడ ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు భవన నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.